



తనకి వీడ్కోలివ్వడానికి బస్టాండ్ దాకా వచ్చిన జయతో అంది నిర్మల: "చూడు జయా, నీకెప్పుడైనా ఈ రకపు జీవితం నిస్సారమనిపించినపుడు - సందేహించక పెళ్ళి చేసుకో ! సంకోచించకు! అలాంటి సమయమంటూ వస్తే ఆత్మవంచన చేసుకోననీ - ఏదీ మాటివ్వు!" అంటూ చేయి ముందుకు జాపింది నిర్మల.

ఆ చేతిని గట్టిగా గిల్లి అంది జయ: " అన్నమాట నిలుపుకోగలనో లేనో తెలీనపుడు ఇలా మాటివ్వడం, ఒట్టేయడం నాకిష్టం వుండదని తెలీదానీకు? అయినా నా ప్రవర్తన నాకు సంతృప్తి కల్గించి, నాలో పెళ్ళి అంటే ఆసక్తి కలిగినపుడు-

తప్పకుండా పెళ్ళి చేసుకుంటాను."

జయ మాట్లాడ్తూనే వుంది. బస్ కదిలింది. జయ వీడ్కోలిస్తూ తనతో ఆఖరిగా 'నా ప్రవర్తన నాకు సంతృప్తి కల్గించి' అన్నమాటకి అర్థమేమిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు నిర్మలకి.

******

రజిత కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయ్.

తను జయకి ఉత్తరాలు రాయక ఆరునెలలవుతోంది! ఇన్ని రోజులుగా తనెప్పుడూ అలా లెటర్స్ వ్రాయకుండా, తనలోని భావాలు బయట పెట్టకుండా వుండలేదు. అలాంటిది తను ఇన్ని రోజులు ఎలా వుండగలిగింది ? - ఎందుకుండలేదూ ? ఎందుకుండదూ? లేకపోతే ఏమిటట ఆ వేషాలు ? ఇప్పుడు జయకి ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందిట ! పోనీ చేసిందే అనుకుందాం... పెళ్ళే వద్దంటూ ఆ భీష్మించుక్కూర్చోవడమేమిటీ ? అందుకే - ఆ కోపంతోనే - తను లెటర్స్ రాయడం మానేసింది.

" అదేమిటి రాజీ ! అలా చిక్కిపోతున్నావ్ ? జయ వుత్తరాలు రాయడం లేదా ఏమిటీ ?" అడిగాడు పండగ సెలవులకి ఇంటికి వచ్చిన వినోద్.

" నేను రాస్తేగా - తనురిప్లయ్ ఇవ్వడానికి!" అంది రజిత విరక్తిగా.

" అదేమిటీ ? నువ్వు రాయకపోతే తను రాయకూడదని వుందా ?"

" ఆ పిల్లకా అలవాటు లేదన్నయ్యా! ఆమెదంతా చిత్రమైన మనసు! ఆ మనస్తత్వం ఓ అయోమయం, అంధకారం, కారడవి - ఎవరికీ అంతుపట్టదు! అరుణతో ఎంజాయ్ చేస్తే నా సంగతి కానీ, నాతో ఎంజాయ్ చేస్తోంటే అరుణ సంగతి గానీ ఆమెకి గుర్తే వుండదు! హాస్టల్ నుంచి మేమందరం వచ్చేశాక - ఆమెకిక ఆప్తులేవరూ వుండరనీ, ప్రతిక్షణం మా స్మృతుల్లో జీవిస్తుందనీ - ఏవేవో అనుకున్నాం ! కానీ అదంతా మా భ్రమ అనీ - ఆమెని మనసారా ఇష్టపడ్తూ ఆమె సన్నిధికై ప్రాకులాడే వాళ్ళు ఎప్పటికప్పుడు ఆమెకి లభిస్తుంటారని తెలిసిపోయింది! నేను లెటర్ రాయనంత కాలం నేనామెకి గుర్తు రాను!"

" నువ్వు మరీ అన్యాయంగా మాట్లాడ్తున్నావ్ రాజీ" అన్నాడు వినోద్.

" కావొచ్చు! నా ఆవేదన నన్నిలా పలికిస్తుందేమో ! మరి రెగ్యులర్‌గా లెటర్స్ రాసే నేను - ఈసారి ఆరు నెలలు జాప్యం చేసినా - నాకేమైందో, ఎందుకు రాయట్లేదో తెలుసుకుందామనే ప్రయత్నమేమైనా చేసిందా తను ? దీనికేమంటావ్?" అడిగింది రజిత.

వినోద్ మాట్లాడలేదు !

******

**ఏం రాజీ -**

నాపై కోపం వచ్చిందా ? లేకపోతే ఎందుకని వుత్తరాలు రాయట్లేదు ? ఒంట్లో

గానీ బావుండటంలేదా ? వెంటనే నీ యోగ క్షేమాలతో లెటర్ వచ్చేదాకా నాకు ఆదుర్దాగానే వుంటుంది!

మొన్న మామ్మ వచ్చింది హాస్టల్‌కి - 'పెళ్ళి చేసుకుంటావా లేదా ?" అంటూ నా ప్రాణాలు తోడేసింది! చేసుకోనని చెప్తే, పిల్లలందరికీ వినబడేలా ఎక్కడ అరుస్తుందో అని భయపడ్డాను! అదేం చేయలేదు. అంతకన్నా పెద్దమాటే ఒకటంది- 'నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నీముందే ఉరి పెట్టుకుంటాను' అని ఆవేశపడి పోయింది! అసలే మామ్మకి బ్లడ్ ప్రెషర్ ! తాత్కాలికంగా ఆమెని శాంతింప చేయడానికి 'సరే' అన్నానేగానీ - అదేమిటో నాకు పెళ్ళి తలచుకుంటేనే భయంగా అదోలా వుంది !

రాజీ -

ఏనాడూ ఎవరికీ చెప్పని నా భావాలనీ, బాధనీ నీముందు బహిర్గతం చేస్తున్నాను. నాకు పెళ్ళి యిష్టం లేదనడానికి వేరే ఏదో అల్ప కారణమే అయ్యుంటే దాన్ని లెక్కచేయాల్సిన అవసరమే వుండేదికాదు.

కాని.... దాంపత్యంలో అతి ముఖ్యమైనది సెక్స్ అంటారు.

ఆ సెక్సంటే నాకేవిటో తలచుకుంటేనే ఒక రకమైన అసహ్యం - ఎలర్జీ. అలాంటి భావాలున్న నేను - ఒక వ్యక్తిని పెళ్ళాడి, ఎదుటివ్యక్తి జీవితాన్ని ఎలా నాశనం చేయనూ?

నా చిన్నతనంలో ఓసారి - అప్పటికి నా కింకా నిండా పదేళ్ళు కూడా లేవు!

"బిస్కెట్ ఇస్తారా పాపా " అని లోపలికి తీసుకెళ్ళి మా పక్కింటి తాత ముద్దుల వర్షం కురిపిస్తూ, వున్నట్టుండి విచిత్రంగా మారిపోయాడు!

అతడి చూపుల్లో ఏదో మార్పు వచ్చింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. నిజానికతడు చేయబోయేదేమిటో తెలీకపోయినా, అతడు నా ఫ్రాక్ పైకి జరిపే ప్రయత్నం చేయడం గమనించి, భయంతో పెద్దపెట్టున అరిచి స్పృహతప్పి పడిపోయాను.

అలా ఏమీ తెలియని వయసులో నాలో ప్రవేశించిన ఆ భయం - ఈ వయస్సులో ఫోబియాకి దారి తీసింది.

ఇక మీ అన్నయ్యకి నేనంటే ఎంత ప్రేముందో, అతడు ఎన్నోసార్లు నాకేసి ఆరాధనగా చూసే చూపుల్లో గ్రహించాను.

కాని... కాని... నన్ను పెళ్ళి చేసుకున్న తర్వాత కూడా ఒకవేళ నాతో శారీరక సౌఖ్యం లభించకపోతే - అతడి కళ్ళల్లో నేను మునపటి ఆరాధననే మళ్ళీ చూడగలనంటావా ?

అందుకే - నా సంగతేమిటో నాకు బాగా తెలిసికూడా - పెళ్ళి చేసుకుని ఎదుటి వ్యక్తి జీవితాన్ని ఎలా నాశనం చేయమంటావ్ ? చెప్పు రాజీ - పోతే, నీ స్నేహితురాలిగా - నా సమస్య నీముందు పెడ్తున్నాను. పరిష్కారం నీకొదిలిపెడ్తూ ముగిస్తున్నాను.

- నీ జయ.

❁❁❁❁❁❁

వినోద్‌కి ఆ లెటర్ చూపించి అతడి సమాధానం కోసం నిరీక్షించింది రజిత. లెటర్ చదువుకుని వినోద్ ఏమీ మాట్లాడలేదు. అతడి ముఖంలో ఎలాంటి ఫీలింగ్స్ చదవలేకపోయింది రజిత.

" అలా తోటలోకి వెళ్ళొద్దాం పద రాజీ !" అంటూ ఆ సాయంత్రం గానీ తన పెదవులు విప్పలేదు వినోద్.

'ఈ సమస్య అపరిష్కృతంగానే వుండిపోతుందా ? లేక అన్నయ్య పరిష్కరించడానికి పూనుకుంటాడా ?' లెక్కలేనన్ని సందేహాలతో వినోద్‌ని అనుసరించింది రజిత.

తోటకి వెళ్ళేదాకా - తోవలో ఏమీ మాట్లాడకుండా వినోద్ గంభీరంగా నడవడంతో రజిత హృదయంలో కల్లోలం చెలరేగింది.

ఓ మామిడి చెట్టుకింద కూర్చున్నారు. ఇద్దరికిద్దరూ మాట్లాడే దశలోలేరు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. అలా ఓ పావుగంట గడిచాక:

" చెప్పరా నీ నిర్ణయమేమిటో ?" రజిత నోటినుంచి మాటలు వచ్చిందే తడవుగా - వేళ్ళతో కనురెప్పలను అదిమిపడ్తూ - లాన్‌లో వాలిపోయాడు వినోద్.

కన్నీళ్ళని అదిమిపెట్టడానికీ అతడు చేస్తోన్న ప్రయత్నంచూసి కలవరపడి "అరే ఇదేంట్రా, పిచ్చీ-లే" తల నిమురుతూ అంది రజిత.

" ఇన్నాళ్ళూ కాలంపై భారం వేసి జయ వుద్దేశ్యం మారకపోతుందా నేను తనకి చేరువ కాకపోతానా అనే ఆశతో - ఎలాగో రోజులు నెట్టుకొచ్చాను! కాని ఇక నాకు సాధ్యంకాదు రాజీ. ప్రతిరోజూ జయ ఆలోచనలతో వూపిరి తీస్తోన్న నేను- ఆమెని నా దాన్ని చేసుకోకుండా ఇంకెంత కాలమో బ్రతకలేను. ఎలా అయినా సరే - తనని ఒప్పించి నాకీ వుపకారం చేసిపెట్టు!" అన్నాడు వినోద్.

" కానీ..."

" నీ అనుమానం నాకర్థమైంది రాజీ - ఆ విషయంలో నన్ను నమ్మమని చెప్పు- పెళ్ళి చేసుకోవడానికి ఆమె అభ్యంతరం అదే అయితే, ఆమె తనంతట తను చేరువయ్యేదాకా - నేనామెని తాకను కూడా తాకనని ప్రామిస్ చేస్తున్నాను" అన్నాడు వినోద్.

రజిత కళ్ళు తృప్తిగా మెరిశాయ్.

❁❁❁❁❁❁

రజితకి వరంగల్లోనే గాంధీ హాస్పిటల్లో డాక్టర్‌గా పనిచేస్తోన్న తన చిన్ననాటి మిత్రుడు సురేష్ సంబంధం ఖాయం చేశాడు వినోద్.

ఓ మంచి ముహూర్తం చూసి జయ పెళ్ళినీ, రజిత పెళ్ళినీ వాళ్ళిద్దరి అభీష్టం ప్రకారంగా ఒకే పందిట్లో చేశారు.

ఆ రోజు శోభనానికి పెద్దలు ఏర్పాట్లు జరపడం చూసి జయ కంపించి పోతూ "ఏమిటదీ?" అడిగింది రజితని.

రజిత నవ్వి అంది: " పెద్దవాళ్ళేదో చేస్తారు. వాళ్ళు ఈ తంతు కాస్తా జరిపితే - తమ బాధ్యత తీరిపోయిందని నిశ్చింతగా వుంటారు. వాళ్ళని నమ్మించడంలో నీకు కలిగే నష్టమేమీ వుండదుగా! కేవలం లోకుల దృష్టిలో మీకు శోభనం జరిగి నట్టు లెక్కగానీ - నీకక్కడ జరిగే అపాయం ఏమీ వుండదు! పిచ్చి పిచ్చి అనుమా నాలు పెట్టుకుని మనసు పాడుచేసుకోక - వాళ్ళు చెప్పినట్టు ఆ గదిలోకి వెళ్ళు."

" రా జయా ! అలాగే నించున్నావ్ ?" తెల్ల చీరలో దేవతలా వెలిగిపోతోన్న జయని రెప్పవాల్చకుండా చూస్తూ ఆప్యాయంగా పిలిచాడు వినోద్.

జయ అడుగు ముందుకు పడలేదు. బెదురు చూపుతో గదంతా చూస్తోంది.

" నీకేం భయంలేదు రా జయా!" అన్నట్టున్నాయి అతడి కళ్ళు.



భయపడ్తూనే దగ్గరకు వెళ్ళింది.

రెండు మంచాలూ ఒకదాని పక్కన మరొకటి వున్నాయి. ఆమె చూపుల్లో అనుమానం గ్రహించి - ఒక మంచాన్ని ఇంకో మంచానికి కొంచెం ఎడంగా లాగి- దానిమీద కూర్చుంటూ - జయని కూర్చోమన్నట్టు రెండో మంచం చూపించాడు.

జయ బిడియపడ్తూ ఒదిగొదిగి కూర్చుంది.

" చూడు జయా - వైవాహిక జీవితంలో ప్రేమ వేరూ, సెక్స్ వేరూ కాకపోవచ్చు. రెండింటికీ అవినాభావ సంబంధమే వుండవచ్చు. కాని మన దాంపత్య జీవితంలో నీకోసం ప్రేమనే ఆదర్శంగా పెట్టుకుని - నీ కోరికకి అనుగుణంగా నడుచుకుంటా నని ప్రామిస్ చేస్తున్నాను. నా పట్ల ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా ఓ స్నేహితుడిలా మూవ్ కావచ్చు! అన్నట్టు అడగడం మరిచాను - సురేష్‌ని చూశావా? మన రజిత పక్కన ఎలా అన్పించాడు ?"

" నాకైతే నచ్చాడు ! మనిషికూడా మంచివాడిలాగే కన్పిస్తున్నాడు" అంది జయ బెరుకు పోగొట్టుకుంటూ.

" అన్నట్టు ఈ మధ్య నువ్వు రాస్తోన్న కథలన్నీ బావుంటున్నాయ్ ! నా సూచనలు దృష్టిలో పెట్టుకునే నువ్వు కథలు రాస్తున్నావనిపించి - ఎంత గర్వంగా ఫీలయ్యానో తెలుసా?"

అతడంటోన్న మాటలు పైపై మాటలు కావనీ - అతడి హృదయాంత రాంతరాల్లోంచే వస్తున్నాయని గ్రహించిన జయకి - అతడి ప్రశంస సంతృప్తి కలిగిం చింది.

అలా ఆ రాత్రంతా సాహిత్యం గురించీ, సినిమాల గురించీ, రాజకీయాల

గురించీ అవీ - ఇవీ - ఒకటేమిటీ అన్నింటి గురించీ - మాట్లాడుతూనే వున్నాడు వినోద్ !

ఆ మాటల ద్వారా అతడి భావాలని గ్రహించి, అతడి వ్యక్తిత్వాన్ని అంచనాకట్టి అతడి గురించి ఆలోచిస్తూ సంతృప్తిగా నిద్రపోయింది జయ !

మధ్యలో ఎందుకో మెలుకువొచ్చి అతడికేసి చూసింది. అతడు తన వంకే చూస్తూ కన్పించడంతో వెంటనే దృష్టి మరల్చుకుంది.

'అబ్బ ! ఆ కళ్ళల్లో ఎంత ఆరాధన ? ఎంత అదృష్టవంతురాలు తను ! ' అనుకుంది జయ.

అదే రాత్రి - పక్కగదిలో - అదే సమయంలో సురేష్ కౌగిట్లో గువ్వలా ఇమిడి పోయింది రజిత.

❁❁❁❁❁❁

" జయా ! నువ్వీ చీరలో ఎంత బావున్నావో తెలుసా ?"

నవ్వింది జయ.

" నిజం జయా ! అదేమిటో నువ్వే చీరకట్టుకున్నా, చివరకది ఎంత పిచ్చి చీరైనా సరే అందంగానే అవుపిస్తావ్ !"

" ప్రతి భార్యా తన భర్తకంటికి అలాగే కన్పిస్తుందంటారు."

" కావొచ్చు ! కానీ, నిన్ను ఆ దృష్టితో చూస్తూ అంటోన్న మాటలు కావవి! అసలు నిజం చెప్పాలంటే ఆ ప్రత్యేకత నీ అందంలో వుంది. అందుకే అలా ఏ చీర కట్టుకున్నా అందంగానే అవుపిస్తావ్! ఆ చీరకట్టు మాత్రం.... షోకేస్‌లో బొమ్మలా ఎంత చక్కగా వుంటుందో ?"

" అహఁ అంత బావుంటుందా ?"

" ఏయ్ ! నువ్వలా ఎగతాళి చేస్తే నేనూర్కోను."

" ఊర్కోక....?"

" ఎత్తుకుని గాల్లో గిరగిరా తిప్పేస్తాను."

" ఊ... తర్వాత ?"

" అలాగే గాఢంగా హృదయానికి హత్తుకుంటాను."

నవ్వుతోన్న జయ ముఖంలో భయంలాంటిదేదో తొంగిచూసింది.

"ఛ పిచ్చిమొద్దూ ! నేనేదో ఏడ్పించడానికలా అంటే, నువ్వు నిజంగానే భయపడ్తున్నట్లున్నావే!" అన్నాడు వినోద్ లాలనగా.

❁❁❁❁❁❁

తనలో విద్యుత్‌లాంటిదేదో ప్రసరించినట్టయి కళ్ళు తెరిచింది జయ.

ఆమె తలగడ పక్కనున్న కుర్చీలో కూర్చుని ఆమె తల దగ్గర తన తలపెట్టి బరువుగా వూపిరితీస్తూ నిద్రపోతోన్న వినోద్ కన్పించాడు.

అతడు వదుల్తోన్న శ్వాస ఆమె మెడకి తగుల్తూ - ఆమెని వుక్కిరిబిక్కిరి చేసేస్తోంది. ఏదో తెలీని భయంతో దిగ్గున లేచి కూర్చుంది జయ.

" పడుకో జయా ! నేను నీ దగ్గర దేన్నీ ఆశించి రాలేదుగానీ - భయపడి లేవకు! జయా, నేనేదో మగాడినన్న సంగతి పూర్తిగా మరిచిపో ! నువ్వూ, రజితా కలిసి అప్పుడప్పుడూ ఒకే మంచంలో పడుకుంటారు చూడూ ! అలాగే దీన్నీ అనుకో ! కనీసం రజిత నీ ఒంటిమీద చెయ్యేసినట్టయినా నేను నీమీద వేయను! కాకపోతే నాకీ అదృష్టమైనా దక్కనివ్వు!" అడిగాడు వినోద్.

జయ మాట్లాడకుండా ఓ పక్కకి జరిగి పడుకుంది. జయ పక్కలో వినోద్ తృప్తిగా నిద్రపోయాడు.

మర్నాడు పొద్దున " నీ ఒంటికేదో సహజ పరిమళం వున్నటుంది జయా ! రాత్రి నీ ఒంటి నుంచేదో సువాసన వెలువడి నన్నెలా వుక్కిరిబిక్కిరి చేసిందనుకున్నావ్!?"

" ఒంటి పరిమళ మేమిటీ, నా తలకాయ ! బహుశః హేరాయిల్ వాసనేమో?"

" కాదు జయా ! నువ్వువాడే హేరాయిల్, షాంపూ, సోప్స్ - ఆ వాసనలన్నీ నాకు తెలుసు, దిసీజ్ ఎ డిఫరెంట్ వన్."

'రజిత కూడా తన దగ్గర ఎప్పుడైనా పడుకుంటే అలాగే అనేది. ఏమిటో కొన్ని విషయాల్లో అన్నా చెల్లెళ్ళిద్దరికీ ఎంత పోలికలో' అనుకుంది జయ.

❋❋❋❋❋❋

క్షణాలు నిముషాలై, నిముషాలు గంటలై, గంటలు రోజులై, రోజులు నెలలై... కాలచక్రం పరిగెడుతూనే వుంది.

వరంగల్లో రజితా, జయా ఒకే ఇంట్లో తమ భర్తలతో కాపురం వుంటున్నారు.

పెళ్ళయిన రెండేళ్ళకి పండంటి బాబుని ఎత్తుకుంది రజిత. వాడు ఎర్రగా, బొద్దుగా, ముద్దొచ్చేలా వుండటంతో జయ వాణ్ణి క్షణం కింద దించేదికాదు.

వాడికి బట్టలేయడం, స్నానం చేయించడం ఒకటేమిటీ సమస్తం తనే చేస్తోంది! ఒక్క పాలు తాగడానికి తప్ప - వాణ్ణి రజితకి ఇచ్చేదేకాదు. వాడి పట్ల జయకున్న మమకారం చూసి ఆశ్చర్యపోయేది రజిత.

ఎప్పుడూ మర్యాద కోసమైనా ఎదుటివాళ్ళ చేతుల్లోంచి పిల్లల్ని తీసుకోని జయకి వాడిపట్ల అంతటి అనురాగం ఎట్లా ఏర్పడిందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు ఆమెకి. బహుశః కాలమే ఇవన్నీ నేర్పుతుందేమో ! అలా జయ గురించి ఆలోచిస్తోన్న రజితకి - అకస్మాత్తుగా మెరుపులాంటి ఆలోచనేదో తట్టి, తళుక్కు మన్నాయ్ ఆమె కళ్ళు.

ట్రాన్స్ఫర్‌కి ప్రయత్నం చేయమని అన్నయ్యకి చెప్పింది.

కారణం అడిగితే తన వుద్దేశ్యం చెప్పింది.

"అసలు జయని వదిలి నువ్వుండగలవా ? ఆమె క్షణం కన్పించకపోతే వెర్రెత్తి పోయిందాన్లా కన్పిస్తావ్. అలాంటిది చేజేతులా ఆమెని ఎలా దూరం

చేసుకుంటావ్?" అన్నాడు వినోద్.

" నిజమే - జయ లేకుండా నేను నిలదొక్కుకోవడం కష్టమే - ఒప్పుకుంటాను. కాని, చదువూ, పెళ్ళీ వుద్యోగం ఏదీ వద్దని భీష్మించుకూర్చున్నదాన్ని నీవైపు సుము ఖురాల్ని చేసే ప్రయత్నంలో ఒక సంవత్సరం పాటు నా పాట్లు నేను పడలేదా ? ఇదీ - అంతే ! కొన్ని రోజులు ఓపిక పడ్తే - మొదటిదాన్లో విజయం సాధించినట్టే ఈ విషయంలో కూడా అనుకున్నది నెరవేర్చుకుంటాను ?"

" సరే - నీ యిష్టం - అలాగే కానీ... చూద్దాం ఏమవుతుందో ?"

ఆ తర్వాత నెల రోజుల్లో హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ చేతిలో పట్టుకుని వచ్చాడు వినోద్.

అది తెలిసి జయ మనస్సంతా అల్లకల్లోలమైంది. పిచ్చెక్కినట్టే అయింది.

రజితనీ, బాబునీ వదిలిపెట్టి ఎలా వెళ్ళేది ? వాడి బోసినవ్వు, నవ్వినప్పుడల్లా సొట్టలుపడే ఆ బుగ్గలూ, నల్లటి వుంగరాల జుత్తూ, తళుక్కుమని మెరిసే ఆ కళ్ళూ, బుల్లి బుల్లి చేతులనూ తను చూడకుండా ఎలా వుండేది ? తనకి తెలీ కుండానే వాడిపై తను పెంచుకున్న మమతానురాగాలకి తనకు తానే ఆశ్చర్య పోతోందిజయ.

ఆమెలో చెలరేగుతోన్న భావాలు గ్రహించిన దానిలా అంది రజిత: "పిల్లల కోసం ఇంత తాపత్రయపడ్తోన్నదానివి, ఆ పిల్లల కోసం ఎందుకు ట్రై చేయ కూడదూ?"

జయ అదోలా చూసింది.

❋❋❋❋❋❋

జయావాళ్ళు హైద్రాబాద్ వెళ్ళే రోజు రానే వచ్చింది.

రిక్షా ఎక్కబోతూ - రజిత కళ్లలో సుళ్ళు తిరుగుతోన్న నీళ్ళు చూసి అధీరురాలైంది. మరుక్షణం: 'అంతా వేషం ! తనను పంపించి హాయిగా బాబుతో ఒక్కర్తే ఆడుకోవాలని ఈ ఎత్తుగడ !' అనుకుంటూ:

" ఎందుకే రాని కన్నీళ్ళ కోసం తాపత్రయపడ్తావ్ ?" అంది జయ కసిగా.

దెబ్బ తిన్నట్టుగా చూసింది రజిత.

❋❋❋❋❋❋

**ప్రియ సఖీ జయా,**

వెళ్తూ వెళ్తూ ఎన్ని జన్మలకీ మరిచిపోని మాట ఎంత బాగా అన్నావే ! నిజమే! నువ్వు చూడని నా కన్నీళ్ళకు గుర్తింపు ఎక్కడిదనీ - నువ్వు చూడాలనే ఆ రోజు రాని కన్నీళ్ళతో ఏడ్వడానికి తాపత్రయపడ్డాను !

అవునూ - అక్కడంటే - నువ్వు చూడాలని ఏడ్పు కొని తెచ్చుకున్నాను. మరి ఇక్కడ రోజూ తాపత్రయపడకుండానే వస్తోన్న కన్నీళ్ళు ఎవరికోసం ? ఎవరి గుర్తింపు కోసం ?

సరేలే, నువ్వు అనడం, నేను పడడం మామూలేగా మనకు!

ఇక బాబు బాగానేవున్నాడుగానీ - వాడికళ్ళు మాత్రం ఎవరి కోసమో వెదుకుతూన్నట్టుగా కన్పిస్తున్నాయ్. బహుశ నీ మీద బెంగెట్టుకున్నాడేమో !? కొంచెం చిక్కినట్టనిపిస్తున్నాడు. వాడికి మాట్లాడ్డమే వచ్చివుంటే 'నాకు నువ్వేంవద్దు ! అత్తే కావాలి' అని గోలెట్టేవాడేమో?

**- నీ రాజీ**

❋❋❋❋❋❋

" బాబుని చూడాలని వుంది, వినోద్!"

" ఓసారి - వెళ్ళొస్తావా మరి ?"

" ఊఁ !"

" తొందరగా వచ్చేయాలి మరి !"

" ఉహూఁ."

" ప్లీజ్ - నువ్వు లేకపోతే నాకిక్కడేం తోచదు!"

" అలాగే!"

కొండంత సంతోషంతో బట్టలవీ సర్దుకొని వరంగల్‌కి ప్రయాణమైంది జయ.

" అప్పుడే వచ్చావేమిటే ?" జయని చూస్తూనే అడిగింది రజిత - పైకి ఆశ్చర్యాన్ని నటిస్తూ, లోలోపల ఆనందిస్తూ.

జయ ఆ మాటలు విన్పించుకునే దశలో లేదు ! బాబుని ఒళ్ళంతా తడిమి తడిమి చూసుకుంటూ, వాడి బుగ్గలమీద కొడ్తూ , వాడు ఏడ్చేలా కన్పించే సరికి - "నా పండూ, నా బంగారు కొండా" అని ముద్దాడ్తూ, గుండెల కదుముకుంటూ ఎలాగైతేనేం వాణ్ణి నవ్విస్తోంది.

రజితకి ఆ దృశ్యం తృప్తిగా వుంది.

ఆ రాత్రి...

"జయా ! నువ్వు చాలా మారిపోయావే" అంది రజిత.

" ఏ విషయంలో ?"

" ఇదివరకు నేనంటే ఇష్టపడేదానివి! ఇప్పుడు నాతో మాట్లాడకుండా పొద్దస్తమానం వాడితోనే కాలం గడుపుతున్నావ్."

" నిజమే రాజీ ! ఆ విషయం నాక్కూడా ఆశ్చర్యంగానే వుంది. ముందొచ్చిన చెవులకన్నా వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్టు - నాల్గేళ్ళ మన అనుబంధం కన్నా కొన్ని నెలల వీడి అనురాగానికి బంధీనై పోయాను."

" వెళ్ళి నెలరోజులైనా కాలేదు. అప్పుడే బాబుమీద బెంగెట్టుకుని వచ్చేశావంటే పిల్లలపట్ల నీకున్న మక్కువ తెలీటంలేదా జయా !? పోతే అన్నయ్య కూడా రెండేళ్ళకి పైగా ఓపిక పట్టాడు ! రెండేళ్ళేమిటీ ? తన జీవితాంతం వరకూ నీ కిష్టం

లేకుండా నీనుంచి ఆ సంబంధాన్ని ఆశించడు వాడు ! కానీ అన్నయ్య సంగతలా పోనీ - నీ విషయం ఏమిటీ ? పిల్లలపట్ల నీకున్న మమకారాన్ని చంపుకోగలవా ? లేదు... నీకా శక్తిలేదు. ఉందని అబద్ధం చెప్పడానికి ప్రయత్నించినా, బాబుని ఎత్తుకున్నప్పు డల్లా నీ కళ్ళల్లో వెలిగే వెలుగులూ, పత్రికల్లో వచ్చే బాబుల బొమ్మలను కత్తిరించుకుని నువ్వు తయారు చేసుకున్న ఆల్బమ్స్ - పిల్లలకోసం నువ్వెంత తహతహలాడి పోతున్నావో స్పష్టం చేస్తాయ్. దీనికేమంటావ్ ?" సూటిగా చూస్తూ అడిగింది రజిత.

" ఆల్బమ్ సంగతి నీకెలా తెలుసే ?"

" నువ్వు దూరమైనంత మాత్రాన నీ గురించి తెలీకుండా పోతుందా ? ఒకసారి బొమ్మలు కత్తిరిస్తూ అన్నయ్య కంటపడ్డావట.వాడే రాశాడు ఈ సంగతి !"

జయ మాట్లాడలేదు.

" బాగా ఆలోచించుకో జయా, నీ పాపను ముద్దాడినప్పుడు నీకు లభించినంత సంతృప్తి - మరెవరి పాపనో ముద్దాడ్తే లభించదు ! అంతమంది ఫ్రెండ్స్ మధ్య కాలం గడిపి ఎప్పుడూ సందడి సందడిగా వుండేనీకు, అన్నయ్య ఆఫీస్‌కి వెళ్ళిపోయాక - ఏమి తోచక ఎంత పిచ్చెక్కినట్టు వుంటుందో నాకు బాగా తెలుసు! ఏం కావాలనుకున్నా అది నీ చేతుల్లోవుంది ! బాగా ఆలోచించుకొని ఏదో ఒక నిర్ణయానికి రా."

ఆ మర్నాడు సురేష్‌కి మస్కాకొట్టి ఎగ్జిబిషన్ చూడాలనే వంకతో హైద్రాబాద్ ప్రయాణమయ్యారు స్నేహితురాళ్ళిద్దరూ.

❁❁❁❁❁❁

తన పెదాలపై ఏదో స్పర్శకు ఒళ్ళంతా పులకరించి కళ్ళు విప్పాడు వినోద్.

టక్కున లేచి నుంచుంది జయ.

" ఇన్నాళ్ళకి ముద్దొచ్చానా జయా ! ధన్యోస్మి" అన్నాడు వినోద్ నవ్వుతూ.

సిగ్గుతో జయ మొగ్గల్లే ముడుచుకుపోయింది.

" ఎందుకిలా వచ్చావ్ ? వెళ్ళి పడుకో !" అన్నాడు వినోద్.

" నిద్ర పట్టడం లేదు."

" జోకొట్టి పడుకోబెట్టనా ?"

" పోండి."

" నా మంచంలోకి వచ్చి నన్ను పొమ్మంటావేమిటీ ?"

" .................. "

" నువ్విలా నా పక్కనొచ్చి కూర్చుంటే నేను నిలదొక్కుకోలేను జయా! ప్లీజ్, గో ఎవే..."

" ఉహుం వెళ్ళను - నే నొచ్చింది మీ కోసమే."

“ అంటే...”

“ ఐ వాంట్ యూ !” అంతకు మించి ఆమె కంఠం పెగల్లేదు.

ప్రసన్నంగా వున్న వినోద్ ముఖం ఒక్కసారిగా గంభీరంగా మారిపోయింది. “అంటే - ఆ విషయంలో నేను బాధపడ్తాన్ననుకుని నువ్వీ పనికి సిద్ధ పడ్డావా ?”

“ లేదు వినోద్ !” కంగారుగా అంది జయ: “ నా స్వార్థం కోసమే వచ్చానిక్కడికి- నాకు రజిత బాబులాంటి బాబు కావాలనిపిస్తోంది!”

ఆమెకేసి ఆశ్చర్యంగా చూశాడు వినోద్. ఆమె ముఖం చూస్తుంటే ఆమె చెప్తోన్నదాంట్లో అబద్ధం లేదనిపిస్తోంది.

అయినా కొంచెం ఏడ్పించాలని “అంతేకానీ నువ్వొచ్చింది - నామీద ప్రేమతో కాదన్నమాట !” నిష్టూరం నటిస్తూ అన్నాడు.

జయతల వంచుకుంది.

ముగ్ధలా నిలబడి వున్న జయని చూస్తుంటే, ఏవేవో భావాలు ముప్పిరిగొని, “జయా - జయా మై డాళింగ్ ! ఎన్నాళ్ళకు నేను కలలుగన్న నా ప్రణయమూర్తిని చూశాను!” అంటూ ఆనందాతిరేకంతో కావలించుకున్నాడు.

అర్థరాత్రిపూట కెవ్వుమన్న జయ అరుపుకి మెలుకువొచ్చిన రజిత కంగారుగా తలుపులు తట్టింది.

మరుక్షణం చెమటలు పట్టిన శరీరంతో నిలువెల్లా వణికిపోతూ - భళ్ళున తలుపులు తెరిచాడు వినోద్.

“ ఏమైందిరా ?”

“ ఏమీలేదు. ఉండండీ ఫిట్స్ వచ్చాయి! శరీరమంతా చల్లబడి పోయింది. డాక్టర్‌ని పిలుచుకుని వస్తే తప్ప, నా మనసు మనసులో వుండదు!” అంటూ చెప్పులేసుకుని బయటకి బయల్దేరాడు వినోద్.

డాక్టర్ వచ్చి జరిగిందేమిటో తెలుసుకుని, జయని పరీక్షించి అన్నాడు. “ఆమె జరిగింది తలచుకుని భయపడ్తోన్నట్టుంది! తన చిన్ననాట ఏదైనా రేప్‌కేస్ చూసిందనుకుంటా! అందుకే - ఆమె సెక్సంటే అసహ్యించుకుంటూ - మానసికంగా సుముఖం కాలేకపోతోంది! మీరు ఆమెతో సన్నిహితంగా మసలుకోండి! ఒకవేళ ఆమె ఇకముందు మీతో ముందట్లా వుండకపోయినా మీరది మైండ్ చేయనట్టుండాలి! తనంతట తాను మీ దగ్గరకు వచ్చేదాకా మీరామె దగ్గరకు వెళ్ళకూడదు! ఇలాంటి భయస్థులు డెలివరీని కూడా గోరంతలు కొండంతలుగా వూహించుకుని భయపడ్తారు. ఆ భయంలో వాళ్ళకి ప్రాణాపాయం కలగవచ్చు! ఆ గండం ఒకటి గడిస్తే - ఆమె తిరిగి మామూలు మనిషైపోతుంది! సెక్స్ పట్ల కూడా ఆసక్తి చూపిస్తుంది!”

“ భగవాన్ - ఈ సంఘటన వల్ల జయకి గర్భం రాకుండా వుండేట్టు చూడూ. మాకే పిల్లలూ అక్కర్లేదు. నా జయ దక్కితే అంతేచాలు!” శూన్యంలోకి చూస్తూ

దేవుడిని ప్రార్థించాడు వినోద్.

❋❋❋❋❋❋

రెండు నెలలు తిరగ్గానే జయ వాంతి చేసుకోవడంతో వినోద్‌కి పిచ్చెక్కినట్టే అయింది.

అబార్షన్ చేయించాలనుకున్నారు. జయ అంగీకరించలేదు. ఆమెకి నెలలు నిండినకొద్దీ, అంతులేని భయాందళనతో వినోద్ మానసికంగా క్రుంగిపోసాగేడు.

" ఫర్వాలేదు - ధైర్యంగా వుండు" అంటూ ప్రతివారం లెటర్స్ రాస్తోంది రజిత.

" అబ్బే- నాకేం భయం! భయపడేదాన్నయితే ఆ రోజు మీ దగ్గరికి ఎందుకు వచ్చేదాన్ని" అనేది జయ.

కాని అది నిజం కాదన్నట్టు తనా మాట అనగానే బెదిరిపోయినట్టుండే ఆమె కళ్ళు స్పష్టం చేసేవి వినోద్‌కి.

అంత భయంలోనూ అబార్షన్‌కి అంగీకరించని ఆమె మనస్తత్వం వింతగా, విచిత్రంగా అన్పించేది అతడికి.

❋❋❋❋❋❋

జయకి రెండు నెలలని తెలిసి, సాయం కోసం రమణమ్మా, రజిత వచ్చారు. హైదరాబాద్ నుంచి, జయ ప్రెగ్నెంటని తెలిసి, ఆ వూళ్ళోనే ప్రాక్టీస్ పెట్టిన అరుణ- తనకి తీరక దొరికినప్పుడల్లా వచ్చి టెస్ట్ చేసి వెళ్తోంది.

రజిత ద్వారా అసలు సంగతి తెలిసిన అరుణ: " ఆ విషయాన్ని నాకు వదిలేసి మీరు నిశ్చింతంగా ఉండండి. తనకే ప్రమాదం జరక్కుండా నాకు తెలిసిన ఓ డాక్టర్ సహాయంతో ఈజీ డెలివరీ అయ్యేలా చూస్తాను" అని ధైర్యం చెప్పింది.

❋❋❋❋❋❋

ప్రసవం అరుణ అనుకున్నంత సులభంగా అవడం లేదన్నట్టు గుండెను చీల్చేస్తోన్న జయ కేకలద్వారా గ్రహించిన వినోద్ మనసు - మనసులోలేదు.

పావుగంట తర్వాత వాడిపోయిన ముఖంతో బయటికి వచ్చిన అరుణ - రజితను కావిలించుకుని బావురుమనగానే - సర్వం అర్థమైన రమణమ్మ కుప్పలా కూలబడి పోయింది.

" నిన్ను అనవసరంగా రెచ్చగొట్టి, నీలో లేని మమతలు రేపి, నీ నిండు జీవితాన్ని బలితీసుకున్న పాపిష్టిరాలిని నేను" అని రజితా,

" నా జయని దక్కించుకోలేని ఈ చదువెందుకూ ?" అంటూ అరుణా హృదయవిదారకంగా ఏడుస్తున్నారు!

వినోద్ చేష్టలుడిగి నించున్నాడు.

'జయ చనిపోయినందుకు ఎవరికీ ఈషణ్మాత్రమైనా బాధకలగట్లేదులా వుంది. లేకపోతే ఎప్పట్లా ఈ మనుషులెందుకలా రోడ్లమీద తిరుగుతున్నారు ? మేళ

తాళాలతో అలా పెళ్ళి వూరేగింపులెలా చేసుకునేవాళ్ళు ? రేడియోలో విషాద సంగీతం రాకుండా ఎల్లారీశ్వరి పాటలెలా వస్తున్నాయ్ ? ఉరుములూ - మెరుపులతో భూ ప్రళయం రాకుండా - వాతావరణం ఇంత మామూలుగా ఎలా వుంటుంది? రజితా, అరుణలింకా గుండె పగిలిపోకుండా ఎలా ఊపిరి తీస్తున్నారు?'

❋❋❋❋❋❋

" రాజీ ఏడ్వొద్దనీ - అస్తమానం యిలా ఏడుస్తూ కూర్చుంటే నీ ఒంటికి మంచిది కాదనీ - ఎన్నిసార్లు చెప్పాను!? ఓ రాత్రీ లేదు - పగలూ లేదు! పొద్దస్తమానం ఒకటే ఏడ్పా ? నిన్న రాత్రంతా నువ్వునిద్ర పోకుండా జయకి సేవలు చేశావని- నిన్ను అప్పుడు లేపలేదుగానీ - లే..లే ! జయకి బాబు పుట్టి - తల్లీ, బిడ్డా క్షేమంగా వున్నారు!"

అమ్మ మాటలకు కళ్ళు నులుముకుంటూ లేచిన రజిత: " నిజంగానా అమ్మా!" అంటూ ఆశ్చర్యానందాలతో రమణమ్మని వాటేసుకుని - కొన్ని నిముషాల పాటు వెక్కి వెక్కి ఏడ్చింది!

రమణమ్మకేమీ అర్థంగాక వింతగా చూసింది.

(సమాప్తం)

**ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక: తేదీ: 8-4-1977**